


జాతీయస్థాయి చదరంగ పోటీలకు నూజివీడు విద్యార్థి



ప్రజాశక్తి - నూజివీడు టౌన్

గుంటూరు జిల్లా గోరంట్లలోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఈ నెల 15 నుండి 17 వరకు జరిగిన అండర్-15 రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో నూజివీడు కుమార్ సిబిఎస్ఇ పాఠశాల విద్యార్థి కొల్ల భవన్ అత్యంత ప్రతిభ కనపరిచి ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ఛైర్మన్ వెంకట కుమార్ తెలిపారు. ఈ విద్యార్థి నవంబర్ మూడో తేదీ నుండి 11వ తేదీ వరకు తమిళనాడులోని హోసూరులో జరిగే జాతీయస్థాయి చదరంగం పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ఆడుతున్నట్లు వెంకట్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బాలుడు తల్లిదండ్రులను, కోచ్‌ను ఆయన అభినందించారు.

ఏలూరులో 'భూ'చోళ్లు..!

'ఏలూరు నగరంలోని ఖాళీ భూములపై భూబకాసురుల కన్ను పడిందా.. ఖాళీ జాగాలను కబ్జా చేసే పనిలో అధికార పార్టీ నాయకులు నిమగ్నమయ్యారా.. ఆర్ఆర్‌పేట ఈదరవారి వీధిలోని ఏలూరు ప్రార్థన సమాజం స్థలంపై భూచోళ్ల కన్నుపడిందా.. అందులో భాగంగానే స్థలంలోని మట్టి తరలించడం, చదును చేయడం వంటి పనులు సాగుతున్నాయా'... అంటే అవుననే సమాధానం వస్తోంది. స్థానిక ఎంఎల్ఎ ప్రధాన అనుచరులు, కార్పొరేషన్‌లోని పాలకుల కనుసన్నల్లో భూకుట్రలు జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు వందేళ్ల క్రితం మహాత్మాగాంధీ శంకుస్థాపన చేసిన స్థలాన్ని లీజు పేరుతో అక్రమ పద్ధతిలో సొంతం చేసుకునేందుకు కుట్రలు జరుగుతున్నాయనే చర్చ నగరవాసుల్లో సాగుతోంది.



పక్కకు పెట్టేసిన ప్రార్థన సమాజం స్థలం బోర్డు

ఆర్ఆర్‌పేట ఈదరవారివీధిలోని ఏలూరు ప్రార్థనా సమాజం స్థలంపై కన్ను

వందేళ్ల క్రితం మహాత్మగాంధీ శంకుస్థాపన చేసిన స్థలానికే ఎసరు

ట్రాక్టర్లతో మట్టి తరలించి, స్థలాన్ని చదును చేస్తూ ముందుకు

దాదాపు వెయ్యి గజాలు, రూ.20 కోట్ల విలువ చేసే భూమిపై కుట్రలు

ఎంఎల్ఎ ప్రధాన అనుచరులు, కార్పొరేషన్‌లోని పాలకులే సుత్రధారులంటూ ఆరోపణలు



చదును చేసిన స్థలం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని ఆర్ఆర్‌పేట ఈదరవారి వీధిలోని వెంకట్రావుపేట స్పెషల్ ఎంసిపి స్కూల్ పక్కన దాదాపు వెయ్యి గజాల ఏలూరు ప్రార్థన సమాజం స్థలం ఉంది. ఈ స్థలంలో 1906లో పురుష సమాజం, 1910లో స్త్రీ సమాజం స్థాపించారు. ఈ ప్రార్థన సమాజం స్థలంలో అప్పట్లో వితంతు వివాహాలు, సతీసహగమనం, బాల్యవివాహాలు, సర్వమత సమ్మేళనం వంటి అనేక అంశాలపై చర్చలు జరిపి ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు జరిగేవని స్థానిక ప్రజలు చెబుతున్నారు. 1921లో మహాత్మాగాంధీ, కస్తూరిబాయ్ ఏలూరుకు విచ్చేసినప్పుడు ఈ స్థలంలో భవన నిర్మాణ ఏర్పాటుకు శంకుస్థాపనసైతం చేశారని చెబుతున్నారు. భవన నిర్మాణం జరగకపోయినప్పటికీ ఒక రేకుల షెడ్డులో ప్రార్థనా సమాజం కార్యకలాపాలు కొనసాగేవని వివరాలు ప్రస్ఫుటం చేస్తున్నాయి. అప్పట్లో ఈ సమాజానికి పని చేసిన వ్యక్తి ఒకరు హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలిసింది. ఈ స్థలంపై మున్సిపాల్టీకి ఎటువంటి హక్కులూ లేవని తెలుస్తోంది. ఈ స్థలంలో ఏర్పాటు చేసిన ఏలూరు ప్రార్థన సమాజం అప్పట్లో సమాజంలోని అనేక సమస్యలపై గొప్పగా పని చేసినట్లు సమాచారం. ఏలూరు జ్యూట్‌మిల్లు యాజమాన్యానికి చెందిన శివగోపాల్ లునాని సైతం ఇక్కడకు సంబంధించిన కార్యక్రమాలకు దాతగా వ్యవహరించినట్లు చెబుతున్నారు. వందేళ్ల క్రితం సమాజంలోని రుగ్మతలపై పోరాడేందుకు కేటాయించిన ఎంతో పవిత్రమైన స్థలం ఇది. ఎన్నో ప్రభుత్వాలు మారినా ఈ స్థలం జోలికి ఇప్పటి వరకూ ఎవరూ వెళ్లలేదు. ప్రస్తుతం ఈ స్థలం ఏలూరు నగరంలోని ప్రధాన సెంటర్‌గా ఉన్న ఆర్ఆర్‌పేటలో ఉంది. ప్రస్తుతం ఇక్కడ గజం స్థలం రూ.రెండు లక్షల వరకూ ఉన్నట్లు చెబుతున్నారు. ఆ ప్రకారం చూస్తే ఈ స్థలం ఖరీదు ప్రస్తుత ధరల ప్రకారం రూ.20 కోట్లు వరకూ ఉండొచ్చని అంచనా. ఏలూరు ఎంఎల్‌ఎగా బడేటి బుజ్జి ఉన్న సమయంలోనూ కార్పొరేషన్‌లోని పాలకులు ఈ స్థలంపై కన్నేసినప్పటికీ ఆయన అడ్డుకున్నట్లు తెలుస్తోంది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్పొరేషన్ పాలకులు ఈ స్థలాన్ని సొంతం చేసుకునేందుకు ప్రయత్నించగా ఎంఎల్ఎ ఆళ్ల నాని ఒప్పుకోలేదని సమాచారం. కూటమి ప్రభుత్వం రావడంతో కార్పొరేషన్‌లోని ప్రధాన పాలకులంతా టిడిపిలో చేరారు. మళ్లీ ప్రార్థనా సమాజం స్థలాన్ని సొంతం చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఎంఎల్ఎ ప్రధాన అనుచరులతో కలిసి దీనికి కుట్ర పన్నినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. మెల్లగా పావులు కదిపిన సదరు నాయకులు స్థలం చదును పేరుతో రంగప్రవేశం చేసినట్లు చర్చ సాగుతోంది. శనివారం ఈదరవారివీధిలోని ఏలూరు ప్రార్థన సమాజం స్థలాన్ని చదును చేసి అక్కడి మట్టిని ట్రాక్టర్ల ద్వారా బయటికి తరలించారని చెబుతున్నారు. వైసిపికి చెందిన కార్పొరేషన్‌లోని నాయకులు టిడిపిలో చేరి చేస్తున్న దురాగతాలపై పట్టణంలో పెద్దఎత్తున చర్చ సాగుతోంది. గతంలో వైసిపి నాయకుల్లా టిడిపి ప్రజాప్రతినిధులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిఎం చంద్రబాబు హెచ్చరించిన కొద్ది రోజుల వ్యవధిలోని ఏలూరులో భూకబ్జాకు తెర తీయడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది. లీజు పేరుతో స్థలాన్ని సొంతం చేసుకునేందుకు నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు చర్చ సాగుతోంది.

ప్రత్యేక కమిటీని సైతం ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ కమిటీ 2014 వరకూ కొనసాగినట్లు ఆధారాలు చెబుతున్నాయి. కమిటీలో ఉన్న వారంతా మరణించడంతో తర్వాత కమిటీ ఉనికిలో లేకుండాపోయిందని చెబుతున్నారు. కమిటీలో ముఖ్య కార్యదర్శిగా

గతంలో సబ్బమ్మదేవి స్కూల్ ఆటస్థలం.. ఇప్పుడు ప్రార్థనా సమాజ స్థలం

ఏలూరు నగరంలో ఎంతో పేరొందిన స్కూళ్లలో సుబ్బమ్మదేవి స్కూల్ ఒకటి. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో స్కూల్‌కు సంబంధించిన ఆటస్థలంపై తీవ్రమైన వివాదం సాగింది. దశాబ్దాలపాటు విద్యార్థులు ఆటలు ఆడుకున్న స్థలాన్ని కుట్రలతో రాజకీయ నాయకులు కొట్టేశారనే విమర్శలు అప్పట్లో వెల్లువెత్తాయి. నగర ప్రజలు స్కూల్ ఆటస్థలాన్ని కాపాడుకునేందుకు ఆందోళనలు సైతం చేసిన పరిస్థితి ఉంది. మళ్లీ టిడిపి అధికారంలోకి వచ్చాక ఏలూరు ప్రార్థనా సమాజం స్థలం అన్యాక్రాంతమయ్యే పరిస్థితి నెలకొందనే విమర్శలు విన్పిస్తున్నాయి. వైసిపి పాలనలో నగరంలోని భూకబ్జాలపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇప్పుడు టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత అంతకంటే దారుణ వ్యవహారాలు కొనసాగుతున్నాయనే చర్చ నగర ప్రజల్లో నెలకొంది.

నాకు తెలియదు.. కనుక్కుంటా..

ఎ.భానుప్రతాప్, ఏలూరు నగర కమిషనర్

ఆర్ఆర్‌పేటలోని ఈదరవారి వీధిలోని ఏలూరు ప్రార్థనా సమాజం స్థలంపై కార్పొరేషన్ కమిషనర్‌ను ప్రజాశక్తి వివరణ కోరింది. ఈ స్థలం కార్పొరేషన్ పరిధిలో ఉందా అని అడగ్గా తనకు (ఐడియా) తెలీదని చెప్పారు. స్థలంలో మట్టి తరలింపు పనులపై ప్రస్తావించగా తాను ప్రస్తుతం ఒక వర్క్‌షాపు నిమిత్తం ఢిల్లీ వెళ్తున్నానని, వివరాలు కనుక్కుంటానని చెప్పారు.

'పది'లో ఉత్తమ ఫలితాల కోసం ప్రత్యేక కృషి

జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం





ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం తెలిపారు. జిల్లాలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ సంవత్సరం విద్యాకిట్లు పూర్తిస్థాయిలో అందించారా, వర్క్ అడ్జస్టుమెంట్ పేరిట చేపట్టిన సర్దుబాట్ల వల్ల ఉపాధ్యాయుల్లో నెలకొన్న అసంతృప్తికి పరిష్కారం ఏమిటీ తదితర ప్రశ్నలకు ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న : జిల్లాలో మొత్తం ఎన్ని పాఠశాలలు ఉన్నాయి. అందులో ప్రభుత్వ పాఠశాలలు ఎన్ని? ప్రభుత్వ హైస్కూళ్లు ఎన్ని?

జిల్లాలో మొత్తం 2,334 పాఠశాలలు ఉండగా అందులో 1,812 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 260 ప్రభుత్వ హైస్కూల్స్ ఉన్నాయి.

ప్రశ్న: సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్రలో భాగంగా ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఏమేమి అందించారు?

టెక్స్ట్ పుస్తకాలు, బూట్లు, సాక్సులు, బ్యాగ్, మూడు జతల యూనిఫారం, డిక్షనరీ, నోటు పుస్తకాలు పూర్తిస్థాయిలో అందించాం.

ప్రశ్న: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఈ సంవత్సరం ఎంత శాతం ఉత్తీర్ణత సాధించారు? గత సంవత్సరం ఎంత? ఉత్తీర్ణత మెరుగుదలకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

గత సంవత్సరం 60 శాతం ఉత్తీర్ణత సాధిస్తే ఈ సంవత్సరం 80 శాతం ఉత్తీర్ణత సాధించారు. పదో తరగతి విద్యార్థులకు ఈ నెలాఖరులోపు సిలబస్ పూర్తి చేయటం జరుగుతుంది. ఇంకా ఏమైనా పెండింగ్ ఉంటే నవంబర్ నెలాఖరుకు పూర్తి చేసి డిసెంబర్ నుంచి ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నాం. ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తాం. ఏ రోజు ఏం చదవాలో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశాం. నవంబర్‌లో జరగనున్న సమ్మేటివ్-1 ఫలితాల ప్రకారం విద్యార్థులను ఎ, బి, సి గ్రూపులుగా విభజించి ప్రత్యేక శిక్షణ ఇస్తాం.

ప్రశ్న: మధ్యాహ్న భోజన పథకం అమలు ఎలా ఉంది? మెనూ ప్రకారం పెడుతున్నారా?

ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. 97 శాతం మంది విద్యార్థులు అంటే జిల్లాలో లక్షా 26 వేల మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తింటున్నారు.

ప్రశ్న: పెండింగ్ బిల్లుల కోసం మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఇటీవల ధర్నాలు చేశారు. బిల్లులు మొత్తం చెల్లించారా, ఏమైనా పెండింగ్ ఉన్నాయా?

ఆగస్టు వరకు బిల్లులు చెల్లించాం. సెప్టెంబర్ నెల బిల్లులు కూడా బ్యాంకులో జమ చేశాం. కార్మికులకు బిల్లులు పెండింగ్ లేవు.

ప్రశ్న: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే క్రీడా పోటీలకు ప్రభుత్వం బడ్జెట్ ఏమీ ఇవ్వడం లేదా? క్రీడల కోసం వచ్చిన విద్యార్థులు అన్న క్యాంటీన్లో భోజనం చేస్తున్నారు. కారణం ఏమిటి?

క్రీడల కోసం ప్రత్యేకమైన బడ్జెట్ అంటూ ఏమీ లేదు. మధ్యాహ్న భోజన పథకం నుంచి వారికి భోజన ఏర్పాట్లు చేస్తున్నాం. అవన్నీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ చూసుకుంటారు.

ప్రశ్న: వర్క్ అడ్జస్టుమెంట్ పేరుతో ఉపాధ్యాయులను 150 కిలోమీటర్ల దూరం వరకు బదిలీలు చేశారని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఆ పరిస్థితి ఎందుకు వచ్చింది?

ఏలూరులో 140 మంది ఉపాధ్యాయులు సర్ ప్లస్‌లో ఉన్నారు. వారిలో 12 మందిని 30, 40 కిలోమీటర్ల దూరం వరకు అడ్జస్ట్ చేశాం. మిగిలిన వారందరినీ దగ్గర్లోనే అడ్జస్ట్ చేశాం.

ప్రశ్న: లాంగ్వేజ్ పండిట్స్ ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న పరిస్థితి ఉంది. ప్రమోషన్లు ప్రక్రియ ఎప్పుడు జరగొచ్చు?

అది ప్రభుత్వ పాలసీ. ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినప్పుడు ప్రక్రియ ప్రారంభిస్తాం.

ప్రశ్న: నాడు-నేడు పేరును 'మనబడి-మన భవిష్యత్తు'గా మార్చిన తర్వాత పనులు చేపట్టారా?

గతంలో ప్రారంభించిన పనులు కొన్ని జరుగుతూ ఉన్నాయి. పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్అండ్‌బి వంటి ఇంజినీరింగ్ శాఖలు ఆ పనులు చూస్తున్నాయి.

ప్రశ్న: మున్సిపల్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వాలని, బదిలీలు చేపట్టాలని, సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ ఉపాధ్యాయులు ఆందోళన చేస్తున్నారు. వీటి పరిష్కారానికి ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ప్రమోషన్లు, అప్‌గ్రేడేషన్ వంటివి ప్రభుత్వ పాలసీలు. ప్రభుత్వం ఉత్తర్వులు ఇస్తే తగిన ప్రక్రియ చేపడతాం. ఇవి జిల్లాస్థాయిలో తీసుకునే నిర్ణయాలు కాదు.

పైప్‌లైన్‌తో గ్యాస్ సరఫరా ఎప్పుడో..?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేయాలనే చర్చ రెండు జిల్లాల ప్రజల్లో జోరుగా సాగుతోంది. పక్కనే ఉన్న కృష్ణా జిల్లాలోని అవనిగడ్డలో పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుండటంతో ఏలూరు నగరంతోపాటు జిల్లాలోని ఇతర పట్టణాలు, గ్రామాల్లో ఇది ఎందుకు అమలు చేయడం లేదో ఏఒక్కరికీ అర్థం కావడం లేదు. పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేస్తే ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.ఎనిమిది వేలకు పైగా ఖర్చు తగ్గే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరాపై పాలకులు దృష్టి సారించాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు.

కృష్ణా జిల్లా అవనిగడ్డలో పైపులైన్ ద్వారా ఇంటింటికీ గ్యాస్

నెలకు కేవలం రూ.200 మాత్రమే బిల్లు

జిల్లాలో ఆ అవకాశమున్నా పట్టించుకోని పాలకులు

అమల్లోకి వస్తే కుటుంబానికి ఏడాదికి రూ.8 వేలుపైనే ఆదా



ప్రతియేటా మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. బిపిఎల్ కుటుంబాలకు మాత్రమే ఇది వర్తించే అవకాశం ఉంది. మధ్యతరగతి, ఉద్యోగులు వంటి ఇతరులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందే అవకాశం లేదు. పట్టణ, గ్రామాల్లో నివశిస్తున్న ప్రజలందరికీ పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా జరిగితే ఎంతగానో మేలు జరిగే అవకాశమున్నా ప్రభుత్వం మాత్రం అటువైపు ఆలోచన చేయడం లేదు. పక్కనే ఉన్న కృష్ణా జిల్లాలోని అవనిగడ్డలో ఇది అమలవుతున్నా ఇక్కడ ఎందుకు అమలు చేయడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంది. పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరాకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (జిఎఐఎల్-గెయిల్) కృష్ణా, గోదావరి బేసిన్ (కెజి బేసిన్) గ్యాస్‌ను ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లోని ప్రతి ఇంటికీ పైపులైన్ ద్వారా సరఫరా చేసేందుకు 2005లో ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. 2020 నాటికి అందరికీ అందజేస్తామని ప్రకటించింది. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం, ఒఎన్‌జిసిపై ఒత్తిడి సైతం తెచ్చింది. చాలా పట్టణాలు, మండల కేంద్రాల్లో ఇంటింటికీ పైపులైన్ ఏర్పాటు చేసినా గ్యాస్ సరఫరా మాత్రం ప్రారంభం కాలేదు. కెజి బేసిన్ గ్యాస్‌ను ఇక్కడి ప్రజల అవసరాలకు వినియోగిస్తే 70 నుంచి 80 శాతం ధరలు తగ్గుతాయి. ప్రస్తుతం ఒక వంట గ్యాస్ సిలిండర్‌కు చెల్లిస్తున్న ధర రూ.900 వరకూ ఉంది. పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేస్తే నెలకు రూ.200 చెల్లిస్తే చాలు. హోటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్వీట్‌షాపులు, కార్ఖానాలు, చిన్న తరహా కుటీర పరిశ్రమలు వంటివి ప్రస్తుతం చెల్లిస్తున్న ధరల్లో 25 శాతంకన్నా తక్కువ ధరకే గ్యాస్ పొందొచ్చు. కెజి బేసిన్ గ్యాస్‌ను మన రాష్ట్ర ప్రజల అవసరాలు తీరాకే ఇతర రాష్ట్రాలకు ఇవ్వాలని అప్పట్లో రాష్ట్రప్రభుత్వం కేంద్రాన్ని డిమాండ్ చేసింది. దీనికి ప్రధాన కారణం కెజి బేసిన్ నుంచి గ్యాస్‌ను ఒఎన్‌జిసి 90 శాతం వరకూ గుజరాత్‌లోని రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు తరలిపోతోంది.

అవనిగడ్డ ప్రజల అనుభవం చూసైనా పాఠాలు నేర్వరా..?

కృష్ణా జిల్లా అవనిగడ్డలో ఇంటింటికీ కుళాయి పైపుల మాదిరిగానే వంటగ్యాస్ పైపులు ఏర్పాటు చేశారు. గెయిల్ సంస్థ పైపులైన్ ద్వారా వంటగ్యాస్ సరఫరా చేస్తోంది. ఈ విధానం వల్ల అవనిగడ్డ ప్రజానీకానికి ఎంతో ప్రయోజనం చేకూరుతోంది. నలుగురు కుటుంబ సభ్యులు ఉన్న ఇంటికి పైపులైన్ ద్వారా గ్యాస్ వాడుకున్నందుకు రెండు నెలలకు ఒకసారి రూ.400 బిల్లు వస్తోంది. అంటే నెలకు వంటగ్యాస్ బిల్లు రూ.200 మాత్రమే. ఏడాదికి రూ.2400 మాత్రమే చెల్లిస్తున్నారు. జిల్లా ప్రజానీకం వంటగ్యాస్‌కు నెలకు రూ.900 చొప్పున ఏడాదికి రూ.10,800 చెల్లిస్తున్నారు. పైపులైన్ ద్వారా వంట గ్యాస్ సరఫరా జరిగితే అవనిగడ్డలో మాదిరిగా ఏడాదికి రూ.2400 మాత్రమే ఖర్చవుతుంది. ప్రభుత్వం ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందించినా కుటుంబానికి రూ.2700 మాత్రమే లబ్ధి చేకూరుతోంది. ఇంకా ప్రతి కుటుంబం రూ.8,400 వరకూ వంటగ్యాస్‌కు ఖర్చు చేయాలి. అదే పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా జరిగితే ఖర్చు తగ్గుతోంది. గ్యాస్ బుక్ చేసుకునే అవసరంగాని, సిలిండర్ అయిపోతుందనే బెంగగాని ఉండదు. మూడు ఉచిత సిలిండర్ల కంటే గెయిల్ పైపులైన్ గ్యాస్ సరఫరాతో ప్రజలకు ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. రెండు జిల్లాల్లోని దాదాపు పది లక్షల కుటుంబాలకు ఇది ఎంతగానో మేలు చేసే పథకంగా చెప్పొచ్చు. దీనిపై జిల్లాలోని పాలకులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చిరుత జాడ కోసం ట్రాప్ కెమెరాలు

పరిశీలించిన అటవీశాఖాధికారులు



పులి పాదముద్రలను అధునాతన సాంకేతిక తరహాలో సేకరిస్తున్న అటవీ శాఖ అధికారులు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు పరిసర ప్రాంతాల్లో శనివారం రాత్రి కలకలం రేపిన చిరుతపులి సంచారంపై అటవీ శాఖాధికారులు శనివారం ఆ పరిసరాలను పరిశీలించారు. శనివారం రాత్రి ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల అండాలమ్మ సాగునీటి చెరువు ప్రాంతం నుంచి జాతీయ రహదారి దాటి, ద్వారకాతిరుమల, భీమడోలు మండలాల పరిధిలోకి చిరుత ప్రవేశించిందనే ప్రచారం పెద్దఎత్తున సాగింది. దీనిపై స్పందించిన భీమడోలు సర్కిల్ పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది హుటాహుటీన ఘటనా స్థలికి చేరుకున్నారు. పరిసరాలను పరిశీలించారు. రోడ్డుకు రెండువైపులా భూముల్లో పులి కాలి ముద్రలను పోలిన జాడలను గమనించారు. పులి సంచరిస్తుందేమోనని సందేహాలు వ్యక్తం చేశారు. ఆ పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలించినా ఎక్కడా పులి ఆచూకీ దొరకలేదు. దీంతో ఆదివారం ఉదయం ఆయా ప్రాంతాల్లో పులి జాడ కనుక్కునేందుకు ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. అదే సమయంలో భీమడోలు పోలీసులు ఆ పరిసరాల్లో నిఘా ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం అటవీ శాఖ రేంజర్ కుమార్ అక్కడికి చేరుకున్నారు. ఆయన సైతం పులి పాదముద్రలను పోలిన ముద్రలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో కొందరు స్థానికులు అక్కడ సంచరించింది పులి కాదని, పెద్ద సైజు అడవి పిల్లి అని తెలిపారు. అది నివాసం ఉండే ప్రాంతాన్ని అధికారులకు చూపారు. తాము దాన్ని పట్టుకునేందుకు గతంలో చేసిన ఏర్పాట్లు విఫలమయ్యాయనే విషయాన్ని సైతం వారి దృష్టికి తెచ్చారు. అది నివాసం ఉండే ప్రాంతంలో గల పాదముద్రలను ప్రస్తుతం అధికారులు పులి పాదముద్రలుగా భావిస్తున్న ముద్రలతో పరిశీలించాలని కోరారు. వీటన్నింటినీ పక్కన పెడితే అటవీ శాఖ రేంజర్ తమ దృష్టికి వచ్చిన పులి పాదముద్రలను సాంకేతికంగా అధునాతన తీరులో సేకరించారు. వాటిని పరీక్షల నిమిత్తం రాజమండ్రిలోని పరిశోధనాశాలకు పంపుతామని, ఆ తరువాత అవి పులి పాదముద్రలా, లేదా ఇతర జంతువుల పాద ముద్రలా అనే విషయం తెలుస్తుందని చెప్పారు. భీమడోలు సిఐ విల్సన్, ఎస్ఐ సుధాకర్, వారి సిబ్బంది శనివారం రాత్రి నుంచి చేపట్టిన రక్షణ చర్యలు, ప్రజలను అప్రమత్తం చేసేందుకు తీసుకున్న జాగ్రత్తలను పలువురు ప్రశంసించారు.

కోర్టు భవనాలను పరిశీలించిన హైకోర్టు జడ్జి



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక జిల్లా కోర్టు, అదనపు జిల్లా కోర్టులను, న్యాయ సేవాధికార సంస్థ, బార్ అసోసియేషన్ భవనాన్ని హైకోర్టు జడ్జి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. తొలుత స్థానిక జిల్లా రెవెన్యూ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్న సురేష్‌రెడ్డికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ పూలమొక్క అందించి స్వాగతం పలికారు. జిల్లాలోని అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, జిల్లా ఎఎస్‌పి సూర్యచంద్రరావు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం, ప్రభుత్వ న్యాయవాది బిజె.రెడ్డి, ఎపి బార్ కౌన్సిల్ మెంబర్ బివి.కృష్ణారెడ్డి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా కోర్టుకు చేరుకొని జిల్లా కోర్టులోని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయమూర్తులతో సమావేశం నిర్వహించారు. కేసుల విచారణ, కోర్టుల పనితీరుపై ఆయన విశ్లేషించారు.

హైకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్, ఎస్‌పి

రాష్ట్ర హైకోర్టు జడ్జి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి సురేష్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో ఏలూరు జిల్లా కోర్టుకు వచ్చిన సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అలాగే జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివ కిషోర్ కూడా జడ్జిని కలిసి పూలమొక్క అందించారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం : ఎంఎల్ఎ ధర్మరాజు



సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామాల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. భీమడోలు మండలంలో ఆయన శనివారం పర్యటించారు. దీనిలో భాగంగా రూ.మూడు కోట్లు పైబడి పైబడి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పొలసానిపల్లిలో సర్పంచి షేక్ రహీమా బేగం హసేన చొరవతో ఒక నిరుద్యోగ యువతి ఉపాధి కోసం ఏర్పాటుచేసిన ఇంటర్‌నెట్ సెంటర్‌ను ఎంఎల్ఎ ప్రారంభించారు. భీమడోలు గణపతి సెంటర్లో ముగిసిన దసరా ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పాల్గొన్నారు. తొలుత పూళ్ల గ్రామ పంచాయతీ పరిధిలో రూ.1.30 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రెండు సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అంబరుపేట పంచాయతీ పరిధిలోని వడ్లపట్ల ఆవాస ప్రాంతంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు, పొలసానిపల్లిలో రూ.13 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు, భీమడోలు పంచాయతీ పరిధిలోని హైస్కూల్ రోడ్లో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. భీమడోలులో నిర్మాణాలు పురోగతిలో ఉన్న గృహనిర్మాణ సంస్థ కాలనీలో రూ.75 లక్షల వ్యయంతో నిర్మించనున్న బిటి రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ నిధులతో చేపట్టిన ఈ పనులు సంక్రాంతిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. పల్లె పండుగ కార్యక్రమాలతో గ్రామాల్లో తాగునీరు సమస్యల తీరడంతోపాటు రవాణా, వ్యవసాయ దాని అనుబంధ కార్యక్రమాలు పురోగతిలో నడుస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు, జనసేన నాయకులు వట్టి పవన్ కుమార్, కూటమికి చెందిన పలువురు నాయకులు, ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డంతా గోతులమయం... ప్రయాణం ప్రమాదకరం..!

నూజివీడు- ఏలూరు రహదారి దుస్థితి
ప్రయాణికుల ఇబ్బందులు
భయాందోళనలో వాహనదారులు
మరమ్మతులు చేయాలని వేడుకోలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రహదారులు నాగరికతకు చిహ్నాలు.. అవి బాగుంటే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి పథంలో నడుస్తాయి. ప్రయాణం సుఖంగా సాగాలంటే ఆ ప్రాంత రోడ్లు నాణ్యతగా ఉండాలి. అయితే ప్రస్తుతం అందుకు భిన్నంగా తయారయ్యాయి రోడ్లు. ఎక్కడ చూసినా గుంతలమయమే. కొన్నిచోట్ల రహదారులు భారీ గుంతలతో దర్శనమిస్తున్నాయి. దీంతో ఆయా మార్గాల్లో ప్రయాణం భారంగా మారుతుంది. నూజివీడు నుంచి ముసునూరు, గోపవరం మీదుగా ఏలూరు వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో దర్శనమిస్తుంది. ఈ రహదారిలో నూజివీడుకు చుట్టుపక్కల ఉన్న గ్రామాల నుంచి వేలాదిమంది ఏదో పని నిమిత్తం నిత్యం ద్విచక్ర వాహనాల్లో, ఆటోల్లో, ఆర్‌టిసి బస్సుల్లో నూజివీడు వస్తూ మళ్లీ సొంత గ్రామాలకు వెళ్తూ ఉంటారు. స్కూల్, కాలేజీ బస్సులు కూడా తిరుగుతూ ఉంటాయి. గుంతలమయంగా ఉన్న ఈ రహదారిలో ప్రయాణించాలంటే నరకప్రాయంగా ఉందని వాహనదారులు వాపో తున్నారు. అదే రాత్రిపూట ఈ రహదారిలో ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాహనాలు నడపాల్సి వస్తుందని వాహనదారులు భయాందోలన వ్యక్తం చేస్తున్నారు.


గోతులమయంగా ఉన్న రహదారి


చెరువుకు గండి పడడంతో కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

ఇటీవల భారీ వర్షాలకు పెద్ద చెరువు గండి పడటం వల్ల నూజివీడు-ఏలూరు రహదారి భారీ కోతకు గురైంది. పెద్ద చెరువు గండి పడి దాదాపు మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు అధికారులు కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు జరపలేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిశీలించి ప్రత్యేక నిధులు కేటాయించి కనీస మరమ్మతులు జరిపి ప్రమాదాలు జరగకుండా నివారించాలని వాహనదారులు, ఆటోవాలాలు, స్కూల్ బస్సుడ్రైవర్లు, ఆర్‌టిసి బస్సు డ్రైవర్లు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బి డిఇ సిహెచ్.బాబూరావును వివరణ కోరగా కాంట్రాక్టరకు నిధులు విడుదల ఆలస్యం అవటం వల్ల వారు ముందుకు రావడం లేదని, త్వరలో మరమ్మతులు చేయిస్తామని చెప్పారు.

నేడు, రేపు జిల్లాలో మంత్రి నాదెండ్ల పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు



రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లాలో రెండు రోజులు పర్యటించనున్నారు. ఈ నెల 21వ తేదీ సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ద్వారకాతిరుమల చేరుకుని శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని రాత్రికి ద్వారకాతిరుమలలో బస చేస్తారు. 22వ తేదీ మంగళవారం ఉదయం పది గంటలకు ద్వారకాతిరుమల నుండి బయలుదేరి 10:30కి ఏలూరు కలెక్టరేట్ చేరుకుని జిల్లా అధికారులతో సమావేశమవుతారు. తిరిగి 11 గంటలకు ఏలూరు నుండి బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు ఉంగుటూరు ధాన్యం కొనుగోలు కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటి గంటలకు ఉంగుటూరు నుండి బయలుదేరి విజయవాడ వెళ్తారు.

22 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోలు

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 22 నుంచి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి తెలిపారు. 2024-25 ఖరీఫ్ పంట కాలంలో లక్షా 80 వేల ఎకరాల్లో వరి సాగు చేశారని, సుమారు 5.60 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావొచ్చునని, అందులో సుమారుగా 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయవచ్చునని అంచనా వేశామన్నారు. అందుకు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ వారు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో జిల్లాలో కోఆపరేటివ్ సొసైటీలు, డిసిఎంఎస్, రైతుల ఉత్పత్తి సంస్థలు (ఎఫ్‌పిఒ) ద్వారా 250 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 12 లక్షల గోనె సంచులను ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉంచినట్లు వివరించారు. రైతుల కళ్లాల వద్దే కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలుకు నిర్ణయించినట్లు తెలిపారు. ధాన్యాన్ని సమీపంలోని రైస్‌మిల్లులకు తరలిస్తారని, పర్యవేక్షణకు క్షేత్రస్థాయిలో మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించామని చెప్పారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం మహాదేవపురంలో గ్రామంలో జరిగిన సిపిఎం 5వ గ్రామ శాఖ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి తానిగడప రత్తయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వంతో జతకట్టి డబుల్ ఇంజిన్ సర్కార్ పేరుతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పిన టిడిపి కూటమి ప్రభుత్వం గడిచిన నాలుగు నెలల్లో పెన్షన్ పెంచడం మినహా మిగిలిన 5 హామీలు అమలు చేయలేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. గతంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా మోడీతో రాజీ పడి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కట్టా భాస్కరరావు, కంకిపాటి రాంబాబు, తానంకి నాగేశ్వరరావు బుజ్జిబాబు పాల్గొన్నారు. తొలుత మహాసభ ప్రారంభ సూచికంగా సిపిఎం జెండాను తానంకి రత్తయ్య ఎగరవేశారు. సమావేశంలో ఇటీవల మరణించిన సీతారాం ఏచూరి, ఆర్ఎస్ చిత్రపటాలకు సంతాపం తెలిపారు.

నేడు, రేపు విజయవాడలో రైతు సదస్సు

ప్రజాశక్తి - ముసునూరు

ఈ నెల 21, 22వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర రైతు సదస్సులో మండలంలోని రైతులు పాల్గొనాలని రైతు సంఘం మండల కార్యదర్శి శ్రీనివాసు కోరారు. ఆదివారం సమైక్య సంఘ కార్యాలయంలో మండల రైతు సంఘ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో నెలకొన్న రైతుల యొక్క సమస్యలను అదేవిధంగా వరద ప్రభావిత ప్రాంతాలలో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని, ప్రస్తుతం తుఫాను ప్రభావంతో కోత కోసే సమయంలో వరి పంట దెబ్బతినే పరిస్థితి ఉందని, ఆ పంటలను కాపాడుకునేందుకు డాల్ఫిన్ పట్టాలను సబ్సిడీపై అందించాలని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోటిరు శ్రీను, కంచర్ల శ్రీను, కంచర్ల దుర్గారావు ,కంచర్ల సత్యనారాయణ, నాగేశ్వరరావు, గంగరాజు ,ధర్మారావు, పుల్లయ్య, ఎసు పాదం పలువురు నాయకులు , రైతులు పాల్గొన్నారు.

సంప్రదాయాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - టి.నరసాపురం

పూర్వీకుల సాంస్కృతీ సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ డిఎస్‌బి.శంకరరావు అన్నారు. ఆదివారం స్థానిక గురుకుల పాఠశాలలో అవ్వాతాతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అవ్వా తాతల అనుభవాలను వివరించారు. అనంతరం అవ్వ, తాతలను సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శంకరరావు మాట్లాడుతూ సెల్ ఫోన్ వంటి ఆధునిక సమాజంలో విద్యార్థులు చదువుపై దృష్టి సారించే విధంగా నేటి విద్యార్థులకు పూర్వీకుల సాంప్రదాయాలు, అలవాట్లు తెలపడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపల్ సిహెచ్ అనూరాధ, కో ఆప్షన్ సభ్యులు శ్రీరామ్మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జట్ల ఎంపిక

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు జిల్లా జూనియర్ జట్ల ఎంపిక మండలంలోని బొర్రంపాలెం హైస్కూల్లో ఆదివారం జరిగింది. చిత్తూరు జిల్లా కాణిపాకంలో ఈ నెల 25 నుంచి 27 వరకు నిర్వహించే 43వ రాష్ట్రస్థాయి అండర్-18 ఖోఖో పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఈ పోటీలను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు కె.రమేష్ ప్రారంభించగా జిల్లాస్థాయి జట్టుకు బాలికలు 40 మంది, బాలురు 50 మంది హాజరవ్వగా 15 మంది బాలికలు, 15 మంది బాలురు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయుడు గొడుగు శ్రీనివాస్ తెలిపారు. జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష కార్యదర్శులు సాంబశివరావు, రంగారావు, ప్రధానోపాధ్యాయుడు ఆలీ ఆధ్వర్యంలో ఎంపిక నిర్వహించారు.

ముదినేపల్లిలో కోతులు పట్టివేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లి గ్రామస్తులను ముప్పుతిప్పలు పెడుతున్న కోతులను పట్టించే కార్యక్రమం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టారు. రెండు రోజులుగా కోతులను పట్టే వ్యక్తులు అంబేద్కర్ నగర్‌లో తిరుగుతూ కోతులను పట్టి బోనులో బంధిస్తున్నారు. రెండు రోజులుగా 70 కోతులను వేటాడి బోనుల్లో బంధించారు. వీటిని ఆదివారం ప్రత్యేక వాహనంలో భద్రాచలం అడవులకు తరలించినట్లు సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ తెలిపారు. గ్రామంలో మిగిలిన ఉన్న కోతులను పట్టించే కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

నేరాలు - ఘోరాలు

పోలవరం కుడికాల్వలో ఈత కొట్టేందుకు వెళ్లి..

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పోలవరం కుడి కాలువలో ఈతకు దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తూ నీట మునిగి గల్లంతైన ఘటన పెదవేగి మండలం కల్వకుంట గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పెదవేగి ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన బెజవాడ ప్రసాద్ (45) కూలి పనులు చేసుకుంటూ ఒంటరిగా జీవిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం పోలవరం కుడి కాలువలో ఈత కొట్టేందుకు దిగాడు. ఐదు నిమిషాల తర్వాత నీటిలో సుడి ఉండటంతో హఠాత్తుగా మునిగి గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారంతో పెదవేగి పోలీసులు, ఫైర్ సిబ్బంది ప్రసాద్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - చింతలపూడి

పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. చింతలపూడి ఎస్ఐ కుటుంబరావు తెలిపిన వివరాల ప్రకారం చింతలపూడి మండలం గణిచర్ల గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.70 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

చోడెం దుర్గ కార్యకలాపాలతో సిపిఎంకు సంబంధం లేదు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం మండలం తూర్పురేగులకుంటవాసి చోడెం దుర్గ కార్యకలాపాలతో సిపిఎంకు ఎటువంటి సంబంధమూ లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రకటించారు. ఆదివారం సిపిఎం మండల కమిటీ సమావేశం పోలోజు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ చోడెం దుర్గ కొంతకాలంగా పార్టీ ప్రాథమిక సభ్యురాలు కాదన్నారు. ఈ కాలంలో పార్టీ సభ్యత్వం లేకపోయినా సిపిఎం జెండా, గుర్తు, పార్టీ వ్యవస్థాపకులు పుచ్చలపల్లి సుందరయ్య పేరును దుర్వినియోగపరుస్తూ కార్యక్రమాలు సాగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. భూసమస్యలతోపాటు ఇంకా కొన్ని కార్యకలాపాలు కొనసాగిస్తుందని, వాటిలో ఇతర పార్టీల వారిని భాగస్వాములను చేస్తూ సిపిఎం విధానాలు, పద్ధతులకు భిన్నంగా వ్యవహరిస్తుందని తెలిపారు. చోడెం దుర్గ పార్టీలో లేకున్నా పార్టీ పేరును దుర్వినియోగపరిస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. అధికారులు, భూస్వాములు, గిరిజనుల వద్ద పార్టీ పేరును వాడుకుంటుందని చెప్పారు. చోడెం దుర్గతోపాటు బేతి కిషోర్ కూడా ఇవే చర్యలకు పాల్పడుతున్నాడన్నారు. చోడెం దుర్గ, బేతి కిషోర్ తమ పార్టీ సభ్యులు కారని, వారు చేపట్టిన కార్యక్రమాలకు, సిపిఎంకు ఎటువంటి సంబంధమూ లేదని అన్నారు. ఈ విషయాన్ని మండల ప్రజలు గమనించాలని కోరారు. డిసెంబర్ 13, 14, 15 తేదీల్లో బుట్టాయగూడెం కేంద్రంలో తొలిసారి జరగనున్న సిపిఎం 26వ జిల్లా మహాసభను మండల ప్రజలు జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అందుగుల ఫ్రాన్సిస్, నాయకులు మొడియం నాగమణి, తామా ముత్యాలమ్మ, కోర్స జలపాలు, ఉడతా వెంకటేష్, వెట్టి వీరయ్య, చంద్రు బుల్లెమ్మ, తెల్లం వెంకటలక్ష్మి, కారం భాస్కర్, పొడియం రాజు, మడివి నరేంద్ర, కొయ్యల శ్రీను, తాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మినుము రైతులకు పరిహారం ఇవ్వాలి

ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన రైతుల నిరసన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

రామిలేరు వరద వల్ల నష్టపోయిన మినుము రైతులకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో పల్లెర్లమూడి శివారు శోభనాపురంలో ఆదివారం మినుము రైతులు నిరసన వ్యక్తం చేశారు. నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు ఘంటా పాపారావు మాట్లాడారు. రామిలేరు వరద వల్ల మినుము పంట దెబ్బతిని రైతులు నష్టపోయినా పంట నష్టం నమోదు చేయకపోవడం అన్యాయమని విమర్శించారు. పంట నష్టాల నమోదు నిబంధనలు సవరించి రైతులను ఆదుకుంటామని ముఖ్యమంత్రి స్వయంగా చెప్పినా పంట నష్టం నమోదు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. శోభనాపురంలో 30 ఎకరాలకుపైగా మినుము పంట వరదకు దెబ్బతిందని చెప్పారు. పంట భూములు కోతకు గురయ్యాయన్నారు. మినుము పంట నష్టం నమోదు చేసి ఎకరాకు రూ.15 వేలు నష్టపరిహారం చెల్లించి మినుము రైతులు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కోతకు గురైన పంట భూములు బాగు చేసుకోవడానికి పరిహారం ఇవ్వాలన్నారు. రామిలేరుకు పడిన గండ్లను పూడ్చాలని కోరారు. మినుము రైతులను ఆదుకోకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మినుము రైతులు పోలగాని కొండయ్య, మెరుగు రమేష్, చేబత్తిన ఆదాం, కొలుసు వెంకటేశ్వరరావు, చేబత్తిన ఇస్సాక్, యలమందల శ్రీనివాసరావు, యలమందల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


నినదిస్తున్న మినుము రైతులు, నేతలు

బకాయి వేతనాలివ్వండి

చింతలపూడి ప్రభుత్వాసుపత్రి వద్ద పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వాసుపత్రుల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తుర్లపాటి బాబు అన్నారు. వేతన బకాయిల కోసం ప్రభుత్వ ఆసుపత్రిలోని పారిశుధ్య కార్మికులు ఆదివారం స్థానిక ఆసుపత్రి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ ఆసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఐదు నెలల బకాయి వేతనం వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల జీతాల నుంచి మినహాయించిన పిఎఫ్, ఇఎస్ఐ సొమ్ము సంబంధిత కార్మికుల ఖాతాల్లో జమ చేయకపోవడం దారుణమన్నారు. జీతాల విడుదల కోరుతూ ఈ నెల 30వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే 31వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ది మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ (ఎఐటియుసి) చింతలపూడి శాఖ అధ్యక్షురాలు తొర్లపాటి మరియమ్మ, నేతలు తిరుమలశెట్టి రాము, కూరపాటి నాగరాజు, కోడిగంటి శ్రీనివాసరాజు, పింగుల రాజకుమారి, మానేపల్లి సుజాత, గొర్రె దేవమణి, బుద్ధవరపు వెంకటరావు, ఇసుకలేటి వాణి తదితరులు పాల్గొన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొండ్రు దేవా అక్కడికి చేరుకుని కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ద్వారా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బుట్టాయగూడెం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు తమకు రావాల్సిన పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ ఆసుపత్రి వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. ఈ నిరసనకు ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ధర్మరాజు, టి.కృష్ణ, ఎం.సత్యవతి, ఎం.సుందరమ్మ, ఎం.సుజాత, కె.లక్ష్మి, కె.వంశీ, జి.జాన్‌బాబు, చిన్నబాబు, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికుల ఆందోళన

గ్రామాల అభివృద్ధే లక్ష్యం


కుక్కునూరు : శంకుస్థాపన చేస్తున్న ఎంపిటిసి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కుక్కునూరు

గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కుక్కునూరు ఎంపిటిసి ములిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం పల్లె పండుగలో భాగంగా కుక్కునూరు గ్రామ పంచాయతీ ఉపసర్పంచి పిచ్చుక రాజు, పంచాయతీ కార్యదర్శి ధర్మ, ఎంపిడిఒ నర్సింహారావు, ఎపిఒ మదన్, జనసేన అధ్యక్షుడు ములిశెట్టి యుగంధర్ ఆధ్వర్యంలో రూ.30 లక్షలతో నిర్మించనున్న గ్రామంలోని జూనియర్ కాలేజీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపిటిసి నాగేశ్వరరావు మాట్లాడుతూ కుక్కునూరు మండలంలో మొత్తం సీసీ రోడ్లను రూ.కోటీ 40 లక్షలతో నిర్మించనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీలో భాగంగా గ్రామాల అభివృద్ధికే సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పోలవరం నియోజకవర్గం కోసం ప్రత్యేక నిధులను ఎంఎల్ఎ బాలరాజు ప్రతిపాదన చేసి గిరిజన గ్రామాలను అభివృద్ధి చేసేందుకు పలు సన్నాహాలు చేశారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి గీతావాణి, బిజెపి కోశాధికారి వాడపల్లి లక్ష్మణాచర్యులు, పులి శ్రీనివాస్, బాలాజీ పాల్గొన్నారు.

టి.నరసాపురం: గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవరపు శ్రీరామ్మూర్తి అన్నారు. మండలంలోని కేతవరంలో ఆదివారం పల్లె పండుగలో భాగంగా రూ.25 లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భీమవరపు జగన్మోహన్‌రావు, జయవరపు శ్రీను, లింగారెడ్డి నాగేశ్వరరావు, బొందలపాటి సత్యనారాయణ, వెలిది నాగబాబు, పంతగాని సోమరాజు, బత్తుల నాగేశ్వరరావు, భీమవరపు ప్రసాద్, వెలిది గంగాధరరావు, నాయుడు రామకృష్ణారావుగౌడ్ పాల్గొన్నారు.

కలిదిండి : పల్లె పండుగతో గ్రామాలాభివృద్ధికి కృషి జరుగుతోందని టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు, ఎఎంసి మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాసచౌదరి అన్నారు. మండలంలోని పోతుమర్రు, కొచ్చర్ల, ఆవకూరు గ్రామాల్లో పలు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. సర్పంచులు గొర్ల వరలక్ష్మి, నరసయ్య, పేర్రాజు, నాయకులు నంబూరి భీమరాజు, హరికృష్ణంరాజు, పామర్తి సత్యనారాయణ, బోయిన శ్రీను, లక్ష్మిపార్వతి, వడ్డే గంగరాజు, పంచాయతీరాజ్ ఎఇ శ్రీనివాస్, ఎపిఒ ఆనంద్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్: మండలంలో మేడేపల్లిలో పల్లె పండుగ కార్యక్రమాలను కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రూ.ఐదు లక్షల నిధులతో సీసీ రోడ్డుకు, రామవరం పంచాయతీలోని రామవరం నుంచి జీడిగుంపు గ్రామానికి రూ.ఐదు లక్షల నిధులతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు అమరవరపు అశోక్, జనసేన మండల అధ్యక్షులు గణేశుల ఆదినారాయణ, బిజెపి మండలాధ్యక్షుడు ములకలపల్లి నరసింహారావు, సిపిఐ మండల కార్యదర్శి బాడిస రాము, జెడ్‌పిటిసి గుజ్జా రామలక్ష్మి, రామవరం, మేడేపల్లి పంచాయతీ సర్పంచులు పిట్టా ప్రసాద్, కట్టం రాంబాబు, ఎంపిడిఒ శ్రీహరి, ఎంపిటిసి సోయం చంద్రరావు, ఇసి రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్, కూటమి నాయకులు మేచినేని సంజయ్, చాపర్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీసుల అమరవీరులకు నివాళి

ప్రజాశక్తి - టి.నరసాపురం

సమాజ శ్రేయస్సు కోసం ఎందరో పోలీసులు అమరులయ్యారని ఎస్ఐ ఎం.జయబాబు అన్నారు. స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ప్రధాన సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ వి.జయకుమార్, రాజు, రమేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

22న విజయవాడలో రైతు సదస్సు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఈ నెల 22న విజయవాడలో జరగనున్న జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు కోరారు. ఆదివారం సాయంత్రం కైకరంలోని తూర్పువీధిలో కౌలు రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని పంటల రైతులు సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కౌలు చట్టం తీసుకువచ్చి కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పరిమి సత్యనారాయణకు రైతునేస్తం పురస్కారం

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని వెల్లమిల్లి గ్రామానికి చెందిన పరిమి సత్యనారాయణ ప్రకృతి వ్యవసాయంలో ఆదర్శనీయంగా నిలుస్తున్నందుకు రైతునేస్తం పురస్కారాన్ని అందుకున్నారు. మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఆదివారం కృష్ణా జిల్లా ఆత్కూరుకు చెందిన స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 20 మంది రైతులను ఎంపిక చేయగా వారిలో పరిమి సత్యనారాయణ ఒకరు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి మండలం విజయిరాయి గ్రామంలోని ఆర్‌సిఎం చర్చి ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రార్థనా మందిర భవనానికి దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఆదివారం ఉదయం శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ 'ఆధ్యాత్మిక చింతన, దైవ ప్రార్థన మనిషికి మానసిక ప్రశాంతతను అందజేస్తాయన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు నిత్యావసరాలు వంటివి అందించి సహాయం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలకు విద్యను చేరువ చేయడం సహా అనేక అంశాల్లో ఆర్‌సిఎం సంస్థ తమ సేవలు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆర్‌సిఎం సంఘ పెద్దలను, సభ్యులను, మత గురువులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఫాదర్ సంతురాజ ఎస్వీడీ, ఫాదర్ బాల, ఫాదర్ బాబు జార్జ్, ఫాదర్ బెన్ని ఎస్వీడి సహా పలువురు పాల్గొన్నారు.

టిడిపి ఎంఎల్‌సి అభ్యర్థిగా పేరాబత్తుల

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి



ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్‌ను టిడిపి అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేరాబత్తుల రాజశేఖర్ టిడిపిలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేశారు. గతంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జడ్‌పిటిసి సభ్యునిగా పనిచేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపిని అంటిపెట్టుకుని ఉన్నారు. ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజుకు అత్యంత సన్నిహితుడు. ఎన్నికలకు ముందు టిడిపి అధినేత చంద్రబాబుకు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో కాకినాడ రూరల్ నుంచి టిడిపి టిక్కెట్‌ను ఆశించారు. అయితే పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించడంతో రాజశేఖర్‌కు టికెట్టు దక్కలేదు. ఇటీవల తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మంత్రులు, ఎంఎల్ఎలు, కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా పేరాబత్తుల పేరును ప్రతిపాదించినట్లు సమాచారం. ఆ నివేదిక మేరకే అధిష్టానం రాజశేఖర్ పేరును ఖరారు చేసింది.



'నిధుల మంజూరు ఘనత చంద్రబాబు, పవన్‌దే'

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని 16 గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటైన ఐదు నెలలకే పంచాయతీలకు నిధులు మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు దక్కుతుందని తెలుగు యువత ఆర్గనైజింగ్ రాష్ట్ర సెక్రటరీ గద్దె రఘుబాబు అన్నారు. ఆదివారం గుళ్లపూడి పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తుల సమక్షంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ వ్యవస్థ ద్వారా తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీలు, నీటిపారుదల కాలువలు, గ్రామంలోని వివిధ సమస్యలను గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి రాగానే వెంటనే పరిష్కరించినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఉమ్మడి కృష్ణా జిల్లా ఉపాధ్యక్షులు కొల్లి గంగారామ్, టిడిపి నాయకులు మందలపు ధర్మరాజు, సాయి, పవన్, రైతులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చించిన జనసేన నేత

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని బొర్రంపాలెంలో అధ్వానంగా ఉన్న ఆర్‌అండ్‌బి రోడ్డుపై గోతులను స్థానిక జనసేన నాయకుడు కంపసాటి రమేష్ సొంతంగా సుమారు రూ .30వేలతో ఆదివారం మట్టి తోలించి పూడ్చించారు. ప్రమాదకరంగా ఉన్న రోడ్డుపై పలు ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రయాణికుల భద్రత దృష్ట్యా గుంతలు పూడ్చించినట్లు ఆయన తెలిపారు.

వీరిశెట్టిగూడెంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని వీరిశెట్టిగూడెం గ్రామంలో టిడిపి గ్రామాధ్యక్షుడు నెక్కలపూడి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఏలూరు ఆయుష్ హాస్పటల్ సిబ్బందిచే ఉచిత వైద్య శిబిరం గ్రామంలోని ఎంపియుపి స్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ గ్రామంలో ఎవరికి ఎప్పుడూ ఏ అవసరమొచ్చినా తాను అండగా ఉంటానన్నారు. ఈ శిబిరంలో 98 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ భానుకిరణ్, మాజీ సర్పంచి బొప్పన్న వీరశేఖరరావు, పి.చలపతిరావు, ఎస్.సుధీర్, వై.మాణిక్యాలరావు, చిన్న, నవీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ గౌరవ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పాలకొల్లు వారి కోర్టులో

O.S. No. 167/2020

బిట్వీన్:
కొప్పిశెట్టి నాగమణి వగైరా ....వాదులు
అండ్
గుర్రపు చంద్రలీల వగైరా ....ప్రతివాదులు

టూ:

2వ ప్రతివాది:- గుర్రపు వరప్రసాద్, S/o నర్సింహమూర్తి (లేటు), పండిత వల్లూరు, పోడూరు మండలం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు గ్రంథంలో 2వ ప్రతివాదికి కోర్టు వారి ఉత్తర్వులమేర పలు పర్యాయములు దావా సమన్లు శ్రీ కోర్టు వారి ద్వారా మరియు రిజిష్టరు పోస్టు ద్వారా పంపినను ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొననందున, శ్రీ కోర్టు వారి ఆదేశానుసారం ఈ పత్రిక ద్వారా సమన్లు అమలు ఉత్తర్వులు జారీచేసియున్నారు. కావున 2వ ప్రతివాది దీ. **28-10-2024** సం. తేదిన ఉదయం గం॥ **10.30** ని॥లకు పైకోర్టు వారి ఎదుట ప్రత్యక్షంగా గాని, లేదా న్యాయవాది గారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియచేసుకోనవలెను. లేనియెడల సదరు గ్రంథం మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియచేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

బొంతు నాగభూషణరావు (గాంధీ)
బొంతు ప్రతిభ
పాలకొల్లు అడ్వకేట్స్
దీ: 20-10-2024 సెల్: 98495 92095